క్లుప్తంగా

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం


పుల్లలచెరువు: పుట్టుకతో ప్రత్యేక ప్రతిభావంతులుగా ఉంటూ పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న వారి పింఛన్లను ఆంక్షల పేరుతో తొలగించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు చర్యకు పరాకాష్ట..అని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జానకిరఘు ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ల తీరుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఖండించారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్ల ఇలా తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. సదరం సర్టిఫికెట్‌లో గతంలో 80 శాతం వరకు ప్రత్యేక ప్రతిభావంతులుగా గుర్తించిన వైద్యులు నేడు ఆదే వ్యక్తులకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఇవ్వడం కూటమి ప్రభుత్వ కుతంత్రాలకు నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలతో కకావికలం అవుతున్న వారి పింఛన్లు తొలగించడం, వారి గోస చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని, అనేక ఆంక్షలు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఇలాంటి చర్యలు మానుకుని ప్రత్యేక ప్రతిభావంతులకు యథావిధిగా పింఛన్లు కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దారవీడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెద్దారవీడు పంచాయతీ పరిధిలోని చెంచుగుడేంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో చెత్త, చెదారం నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఇంటి ముందు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పారే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొట్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకుండా శుభ్రపరుచుకొని వాడుకోవాలని, ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలను తొలగించి కాల్వే ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని, రోజూ ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలని, జ్వరపీడుతులను ముందుగా గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలపై చెట్లు


ఎంపీడీఓ కార్యాలయం గోడపై పెరుగుతున్న చెట్లు

- నెర్రెలిస్తున్న కార్యాలయాల గోడలు
- పట్టించుకోని అధికారులు

కురిచేడు: ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే అధికారులు ఆ కార్యాలయ బాగోగులు పట్టించుకోవటం లేదు. ఒక వైపు గోడల్లో చెట్లు మొలచి అవి అడ్డంగా పగిలిపోతున్నా వాటిని తొలగించే చర్యలు చేపట్టకుండా కేవలం వారి ఆదాయాలపైనే దృష్టి సారిస్తున్నారని కార్యాలయాలకు వచ్చిన ప్రజలు విమర్శిస్తున్నారు. తమ నివాసాలు, సొంత భవనాలైతే ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. కురిచేడులోని ఎంపీడీఓ కార్యాలయ భవనం గోడలపై చెట్లు పెరిగి బీటలు వారింది. భవనంపై కూడా నీటి ట్యాంకు వద్ద రావిచెట్టు మొలిచినా పట్టించుకోకపోవటం ఆ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. తహసీల్దార్ కార్యాలయం గోడలో తహసీల్దార్ గది గోడకు చెట్టు పెరిగినా దాని కొమ్మలు మాత్రం కొట్టి మమ అనిపించారు. గోడలపై చెట్లు పెరిగి బీటలు వారుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆయా కార్యాలయాల అధికారులు ఆ చెట్లను తొలగించి బీటలు వారిన గోడలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


తహసీల్దార్ కార్యాలయంపై ఇలా..

ఇదేనా..స్వచ్ఛ ఆంధ్ర?


తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఇలా..

- తహసీల్దార్ కార్యాలయం పక్కనే అపరిశుభ్రం

కురిచేడు: ఒక వైపు స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర పేరుతో అధికారులు, నాయకులు పేపర్లకు ఫోజులు ఇవ్వటంతోనే సరిపోతుంది అనేందుకు ఇది నిదర్శనం. కురిచేడు తహసీల్దార్ కార్యాలయం గోడపక్కన చెత్త పేరుకుని దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం ప్రజలు అనేక పనుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. జిల్లా స్థాయి అధికారులు సైతం కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర పేరుతో తహసీల్దార్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తన కార్యాలయం పక్కన పరిశుభ్రత మరిచిపోయి అందరికీ పరిశుభ్రత గురించి ఎంపీడీఓతో కలిసి ఆదేశాలు జారీ చేయడం విశేషం. ఇప్పటికైనా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హామీలకు తిలోదకాలిచ్చిన కూటమి సర్కార్


పెద్దదోర్నాల: క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు గెలిచాక కూటమి సర్కార్ తిలోదకాలు ఇచ్చిందని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని చిన్న గుడిపాడులో మంగళవారం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డితో పాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రమణబాబు, వైస్ సర్పంచ్ గాలిరెడ్డి, మాజీ డీలర్ ఆంజనేయులు, మండల నాయకులు యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, షేక్ షెక్షావలి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం: చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేసారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని వెల్లంపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో అలివికాని హామీలు ఇచ్చారని, అవి సంవత్సరమైనా ప్రజలకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రజలు అన్నీ గ్రహిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పార్టీ నాయకులు గ్రామ సర్పంచ్ దార్ల ఏలియా, ఎంపీటీసీ దూదేకుల సిద్ధయ్య, జి.బాలకోటిరెడ్డి, బి.వెంకటరెడ్డి, దార్ల దేవయ్య, రాజారావు, డి.నాగాంజి, కె.చిన్న వెంకటయ్య పాల్గొని ప్రసంగించారు.


త్రిపురాంతకం మండలం వెల్లంపల్లిలో..

22న మెగా వైద్య శిబిరం


కరపత్రాలు విడుదల చేస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

దర్శి: స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాలులో రోటరీ క్లబ్ జోన్ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్, ఎస్‌టీఆర్ మార్కెటింగ్ అధినేత సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కిమ్స్ సౌజన్యంతో ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే మెగా వైద్య శిబిరం కరపత్రాలను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. వైద్య శిబిరంలో గుండె, నరాలు, మోకాళ్ల మార్పిడి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, కిడ్నీలో రాళ్లు, గ్యాస్ ట్రబుల్, లివర్, స్త్రీల సంబంధిత వైద్య నిపుణులు, ఊపిరితిత్తుల వైద్యం వంటి అన్నీ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారికి ఉన్న దీర్ఘకాలిక వ్యాధులను కనుగొని సూచించిన మందులు వాడుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తిరుపతిరెడ్డి కోరారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బోయిళ్ల నాగేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ అంబవరపు నారాయణరెడ్డి, ట్రెజరర్ కర్తా రమణారెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, రెడ్డిమాసు శీను, చెమిరెడ్డి రాజారెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊపందుకున్న స్వామిత్వ సర్వే


సర్వే చేస్తున్న పంచాయతీ అధికారులు

కురిచేడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వామిత్వ సర్వే ఊపందుకుంది. వెబ్ కెమెరా ద్వారా గ్రామాల్లోని ఇళ్ల సర్వే పూర్తి చేసి మ్యాప్‌లు సంబంధిత కార్యాలయాలకు పంపి వాటిని సర్వే చేసే పనిని పంచాయతీ, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తొలుత ఆ మ్యాప్‌ల ప్రకారం ఆయా ఇళ్లను పరిశీలించి కొలతలు తీస్తారు. వాటిని వీఆర్వో, సర్వేయర్ మళ్లీ పరిశీలించి ఫారం–36లో ఎంటర్ చేస్తారు. ఆ తర్వాత ఇంటికి సంబంధించిన గుర్తింపు కార్డు ఇస్తారని పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ తెలిపారు. మొదటి దశలో పేరంబొట్ల పాలెం గ్రామం సర్వే చేసినట్లు పేర్కొన్నారు. రెండో దశలో మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 13 గ్రామ పంచాయతీలను సర్వే చేయాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కురిచేడు పంచాయతీలో ఒకటో సచివాలయం కార్యదర్శి చాంద్‌బీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్ మల్లికార్జునరెడ్డి, వీఆర్వో కేవీ నాగరాజు ఒక టీం, రెండో సచివాలయం కార్యదర్శి జె.అనూష, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.మౌనిక, సర్వేయర్ ఏ.గోపి, వీఆర్వో సరోజినిలు మరో టీంగా ఏర్పడి సర్వే చేస్తారని ఆమె తెలిపారు. మిగిలిన సచివాలయాల్లో కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, సర్వేయర్లు సర్వే చేస్తున్నారని ఆమె తెలిపారు.

కాలువల ఆక్రమణలు తొలగించాలి

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని కాలువలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు తొలగించాలని కమిషనర్ మహేష్ హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై మురళీతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని కాలువలపై ఉన్న నిర్మాణాలు తీసి వేసి పూడిక తీయనున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై నీరు కాలువల్లోకి వెళ్లేలా ఎవరికి వారు స్వచ్ఛందంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న కమిషనర్ మహేష్

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి

త్రిపురాంతకం: సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. మహాసభల్లో నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలన్నారు. పార్టీ నాయకులు బి.రామయ్య, డి.శ్రీనివాస్, మల్లికార్జున్, టి. ఆంజనేయులు మాట్లాడారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రధానోపాధ్యాయుని దాతృత్వం


నోట్‌పుస్తకాలు, పలకలు అందజేస్తున్న ప్రభుదాసు

దొనకొండ (కురిచేడు): వృత్తిని దైవంగా, పాఠశాలలోని విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకునే ఉపాధ్యాయులుండటం వరంగా భావించాలి. ఆదిమూలపు ప్రభుదాసు అనే ప్రధానోపాధ్యాయుడు మండలంలోని పోలేపల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల 1, 2వ తరగతి విద్యార్థులకు మంగళవారం పలకలు , నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. ఆయన తన సొంత ఖర్చుతో వాటిని పంపిణీ చేయడంతో గ్రామస్తులు అభినందించారు.

తాళ్లూరు మండలాన్ని ప్రకాశంలోనే కొనసాగించాలి

తాళ్లూరు: మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండల వాసుల రోజువారీ అవసరాలతో పాటు అత్యవసరంగా పనుల రీత్యా వాహన సదుపాయం ఉండటంతో సులభంగా ప్రస్తుత జిల్లా కేంద్రం ఒంగోలుకు వెళ్తున్నారని తెలిపారు. మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలిపితే వందల కిలో మీటర్ల ప్రయాణంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఎప్పటిలాగే తాళ్లూరు మండలం ప్రకాశం జిల్లాలోనే కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

సీ,డీ గ్రేడ్ విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి

దర్శి: ప్రణాళితో సీ,డీ గ్రేడ్ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ప్రభుత్వ డైట్ కళాశాల అధ్యాపకుడు ఈ.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఏపీ విద్యా కమిషనర్, డీఈఓ ఆదేశాల మేరకు గవర్నమెంట్ డైట్ లెక్చరర్‌లు పలు మండలాల్లోని పాఠశాలలను విజిట్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ డైట్ కాలేజ్ మైనంపాడుకు చెందిన సీనియర్ అధ్యాపకులు ఈ.శివప్రసాద్‌రెడ్డి దర్శి మండలం తూర్పు చౌటపాలెం ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లల సామర్థ్యాలు, విద్యార్థుల నోట్స్ కరెక్షన్ పరిశీలించారు. మిడ్ డే మీల్స్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీ,డీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఏ గ్రేడు లెవల్‌కు తీసుకు రావాలని సూచించారు. విద్యను మెరుగు పరచాలని సూచించారు. తూర్పు చౌటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీతమ్మ పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న శివప్రసాద్‌రెడ్డి

పాఠశాలకు బీరువా వితరణ


ఆదినారాయణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని తూర్పు వెంకటాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు రూ. 8 వేల విలువైన బీరువాను ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వేమూరి అనిల్‌కుమార్ మంగళవారం బహూకరించారు. ఆయన తండ్రి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం వారి సోదరుడు ఆదినారాయణ చేతుల మీదుగా బీరువా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పాఠశాల అవసరాలను గుర్తించి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, ఉపాధ్యాయులు అట్లూరి రామారావు, రవికుమార్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, వెంకటాచలం, అశ్విని, విక్రం, రాజ్యలక్ష్మి, లావణ్య, నాగమ్మ, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

పింఛన్ రాని దివ్యాంగులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు: 90 నుంచి 80 శాతం అంగవైకల్యం ఉన్నా రీవెరిఫికేషన్ పేరుతో కోత పెట్టి దివ్యాంగుల పింఛన్ తీసుకునేందుకు అనర్హులంటూ లబ్ధిదారులకు ప్రభుత్వం నోటీసులు పంపింది. పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతూ నోటీసులు అందుకున్న బాధితులు జిల్లా అధికారులను ఆశ్రయించారు. దివ్యాంగులు మళ్లీ అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆధార్ కార్డు, పింఛన్ రద్దు నోటీసు పత్రం, పాత సదరం సర్టిఫికెట్, కొత్త సదరం సర్టిఫికెట్ జతపరిచి ఎంపీడీవోకు అర్జీ రాసి ఇవ్వాలని మండల దివ్యాంగుల విభాగం నాయకుడు వై.అంజిబాబు సూచించారు.

120 మంది దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అలింగో వైద్యులు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. నియోజకవర్గంలోని 120 మంది విభిన్న ప్రతిభావంతులైన నడవలేని, మతిస్థితిమితం లేని, మూగ, చెవిటి, విద్యార్థులకు అలింగో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారని, వారికి ఎంఆర్ కిట్స్, సీపీ చైర్స్, వీల్ చైర్స్ ట్రై సైకిళ్లు, చేతికర్రలు, కళ్లద్దాలు వంటి అవసరమైన ఉపకరణాలకు డాక్టర్లు సిఫార్సు చేశారని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. పాఠశాలలో ఉండే విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు కొన్ని ప్రత్యేక సమస్యలతో బాధ పడుతుంటారని, ఉపాధ్యాయులు వారిని గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని, యూ డైస్‌లో వారి పేర్లు నమోదు చేయాలని, ఆ విధంగా చేస్తే వారికి ప్రత్యేక రాయితీ ఇప్పించే అవకాశం ఉంటుందని సూచించారు. జిల్లా ఐఈ కోఆర్డినేటర్ నాగేంద్రనాయక్, ఎంఈవోలు మస్తాన్ నాయక్, ఖాశిం, రాజశేఖరరెడ్డి, ఇందిర పాల్గొన్నారు.


సుబ్బారెడ్డి మృతదేహం

శ్రీశైలం ఘాట్‌లో ప్రమాదం

- అదుపుతప్పిన బైకు
- వైఎస్సార్ జిల్లా సిద్ధవటానికి చెందిన వ్యక్తి మృతి

పెద్దదోర్నాల: వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్‌లోని చిన్నారుట్ల సమీపంలో మంగళవారం జరిగింది. ప్రమాదంలో వైఎస్సార్ జిల్లా సిద్ధవటానికి చెందిన కొంగ సుబ్బారెడ్డి (44) దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆయన కథనం ప్రకారం.. వైఎస్సార్ జిల్లా సిద్ధవటానికి చెందిన కొంగ సుబ్బారెడ్డి తన బంధువైన మహిళతో కలిసి శ్రీశైలం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో శ్రీశైలం రహదారిలోని పెద్ద చిన్నారుట్ల సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కొండను ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయాలైన సుబ్బారెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న తీగలేరు


చిన్నదోర్నాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తీగలేరు

- ట్రాఫిక్‌కు అంతరాయం

పెద్దదోర్నాల: నల్లమల అభయారణ్యంలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నల్లమలలో కురుస్తున్న భారీ వర్షాలకు తీగలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో మండల పరిధిలోని చిన్నదోర్నాల వద్ద మార్కాపురం, దోర్నాల రహదారిపై దశాబ్దాల క్రితం నిర్మించిన నేల బారు చప్టాపై నీరు భారీగా ప్రవహిస్తోంది. దీంతో ఆయా మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే పలు వాహనాలు కుంట మీదుగా రాకపోకలను సాగించాయి.